# "రసికాసూరులు"

ధనస్సు

★

[గీతాకుమారి పేరుమోసిన సినిమా గాయకు రాలు. పలు సభలవల్ల ఆమె పేర నలుదిశల మారు మ్రోగింది తన గానామృతాన్ని ప్రజానీకానికి పంచిపెట్టి ఆ పైకాన్ని అనేకనిధులకు విరాళాలుగా యిచ్చిన తన నామానికి వన్నెచిన్నెలు దిద్దిన వ్యక్తి అట్టిఆపె రాకకై అనేకసార్లు వేచివేచి నిరాశులైయున్న రసికబృందానికి ప్ర ప్రథమఅవకాశం. ఆపె ప్రథమసమావేశం.

గీతాకుమారి గానంగురించి యెన్ని వత్సరముల నుండో దీర్ఘతపస్సుచేస్తూ పదేపదే ఆహ్వానాలు పంపిపంపి నిరాసులైయున్నవారి ఫలం ఒకానొక సుసమయంలో ఫలించింది. అదే వసంతకాల చైత్రమాస సమయం కోయిల కుహుకుహూ రవాలు కుమారి మధుర గానాన్ని జ్ఞప్తికితెస్తూన్న సమయం. ఇట్టి సమయంలో రసికబృందానికి గీతాకుమారి సన్నివేశం ]

పట్టలేని హృదయా వేదనతో వేచియున్న రసికబృందానికి గీతాకుమారి వస్తూందన్నప్పటికే చంద్రోదయ సమయంలో కలువలు విప్పారినట్లు ముఖాలు విప్పారాయి. ఆపెరాక యెంతదగ్గరలో నున్నప్పటికీ ఆమె యెప్పుడువస్తుంది. ఆపె గానంలో మునిగి తేలుటకు యెంత త్వరితంగా అవకాశం కల్గుతుందన్న తహతహ స్వల్పజాప్యాన్ని విసుగుకల్గిస్తుంది.

ఆపె వచ్చేదినం దగ్గరలోనే ఉందని వార్తలు బయలుదేరాయి. కాని వేచివెసారియున్న యీ రసికులకు నమ్మకం చాలకుండాఉంది. "ఇన్ని ఆహ్వానాలు పంపేమే యీమారు పలుకుతుందా? ఘనసినీ గాయకురాలైన ఆమె యిక్కడికి వస్తుందా? వచ్చి మనల్నితన గానంతో ఆనందింప చేస్తుందా?" అని అనేకములైన శంకలు బయలు దేరాయి.

దేవుని దయవల్ల పూర్వతపఃఫలము పూర్ణమయి ఫలానా దినాన్ని ఆమె వస్తుందని ఊరంతా మారుమ్రోగింది. రసికుల ఆనందానికి మేరలేదు. ఏచ్చటచూచినా కుమారి ప్రశంసే. ఆమె కీర్తి, యశస్సుల వాదప్రతివాదాలు వీధివీధుల చెలరేగాయి. ఆమె గాన మాధుర్యాన్ని ఆలకిస్తూ ఆనందంలో మునిగి తేలుతున్నారు

... . ...

ఫలానార్రైలులో వస్తుందని తెలిసింది. ఆమెకు అఖండస్వాగతం ఇవ్వడానికి రసికులంతా మహోత్తర సన్నాహాలతో ప్రయాణం సాగించారు. స్వాగతం అతిఘనంగా జరిగింది. అట్టిది యీ దేశంలో ఇంకెవరికీ జరిగివుండదనిపించింది. ఒక్కమారు ఆమెను ఆ స్వాగతం గగనవీధులలో విహరింపజేసి ఊరూరించింది. అందరిని చాలానిడాఘాల హృదయగంగా అభినందించింది.

. . ...

గీతవచ్చింది వచ్చిందని మూలమూలల భేరీలు మ్రోగించారు. మునుపటి అపనమ్మకం అంతా ఒక్కమారు దిగజారింది. గాన మాధుర్యంలో మునక్కలు వేయుటకు మహత్తరవకాశం లభించిందికదా అని పరమానందభరితు లయారు. ఆ సభకై ఆమెకీర్తి స్తోత్రపాఠాలు వర్ణించుతూ, బంధుమిత్రసపరివారంగా బయలు వెడలుటకు సన్నాహాలుచేశారు

సభ ఒకవీధిలో వీధి పందిరిలో ఏర్పాటయింది. వీధికిరు ప్రక్కలయిండ్లు. అంత విశాలంగాలేదు వీధి. ఉత్తరాన్ని మెయిన్ రోడ్డు. ఆ మొగలో జట్కాబళ్ళ స్టాండు. దక్షిణాన్ని రెండువందలగజాల దూరంలో ఒకకోవిల. ఆ కోవిల అనుకుంటూ తూర్పుపడమరలుగా ఒక

వీధి- మధ్యంగా, పడమరనున్న యిండ్లను అనుకుంటూ తూర్పుముఖంగా, యిటికలపైగద్దె నాలుగడుగుల యెత్తులో అమర్చబడిఉంది. గద్దెవెనుకనున్న అరుగులమీద స్త్రీ సమూహానికి, ఎదురునున్న అరుగులమీదకూడా స్త్రీలకే, మధ్యగా గద్దెకి తగులుతూ నాలుగుప్రక్కల జనం కూర్చునుటకు కొంతజనం వారివెనుకగా నలుప్రక్కలా నిలబడిఉండటానికి మైక్, లౌడ్ స్పీకర్స్ నాలుగుమూలలా అమర్చబడిఉన్నాయి.

రాత్రిసభ- మిద్దె లెక్కినారు, గోడ లెక్కినారు- అరుగు లెక్కినారు సభాస్థలంఅంతా జనసమ్మర్దంతో కలకలలాడుతోంది - చీమైనా దూరటానికి అవకాశం లేనట్టుంది- కూర్చొనుటకు వీలుకాక బారులుతీర్చి నలుప్రక్కలా (కిక్కిరిసి నిలబడియున్నారు జనం-

సభా ప్రారంభసమయం వచ్చింది - గడియారాలు చూసుకొని సమయం ఆసన్నమయిందని ఆమె రాకకై గుటకలు మ్రింగుతూ వేచియున్నారు-

టైమ్ దాటింది- ఎవరూ గద్దెమీద అగుపడరు- పెద్దల తహతహ ఈసమయంలో యేమూలనుంచో తంబుర, మృదంగం, ఫిడేలువచ్చి గద్దె నలంకరించాయి- ఇంకొంత సేపటికి వాయిద్యగాండ్రు వచ్చి శ్రుతిమేళం చేస్తున్నారు- కొంత అలజడి, ఆవేశం బయలుదేరాయి- కోలాహలం హెచ్చింది- కాని గీతాకుమారి దర్శనంలేదే ఆవేశపరవశులై గెంతులు వేస్తున్నారు-

మైక్ లో ఏదోగోల_

ఒక్కసారి సభలోని నిశ్శబ్దం-

"ఓపికపట్టండి, సహాజనం చూపండి- గీతాకుమారివచ్చి దారిలేక వేచియున్నారు- దారి చూపండి-"

"అలాగే, అలాగే" అని గోలతప్ప; దగ్గిరా చూచుటకు మళ్ళీఅవకాశం చిక్కుతుందో లేదో అని గద్దెకి మరీ దగ్గరయారు-

మళ్ళీ మైక్ లో గోల

సభలో నిశ్శబ్దం

కేకలు

సభలో చలనం

బొబ్బలు

సభలో సర్దుకున్న అలజడి

రసికులు సర్దుకున్నారు: కొద్దిగా దారియేర్పడింది కుమారి వస్తున్నదని కోలాహలం బయలుదేరింది_

"అదిగో! అదిగో! కుమారి! అటు, అటు" అని కేకలు—

సభలో ఒక్కసారి సంచలనం

దారి కిరువైపులా బారులుతీర్చి నిలబడ్డారు

అల్లంతదూరాన కుమారి ముఖపద్మం సభనలంకరించిన దీపికా సహస్రంలో తళుక్కుమంది_ రసికాసుర భృంగాలు పులకరించాయి! కుమారి ముఖసరసిజాన్ని ఆస్వాదించబోయాయి సభలో పెద్దల కలకలం? పద్మం వాడిపోతుందన్న భయంతో పద్మాన్ని అనుసరిస్తున్న పెద్దలకి కష్టంమీద ఆసురబృందం మధ్య ప్రదేశం నుండి బయటపడి గద్దె సమీపించారు! జాలిగా నలువైపులా దృక్కుల ప్రసరింపజేసి నమస్కరించి గద్దె నలంకరించింది; "వాతాపి గణపతిం భజే" గానం ప్రారంభమయింది, ఆవేళ పరవశులైన రసికాసురుల రొద హెచ్చుస్థాయికి వస్తుంది-

"వినండి, వినండి"

"అంతా విందాం, అంతా చూద్దాం? ఆనందిద్దాం" అని కేకలు—

"కూర్చొండి; కూర్చొండి!" అని ఓప్రక్క నుండి కేకలు

ఈ ధ్వనులలో మైకు మౌనం దాల్చింది

రొద మరీ హెచ్చుతుంది

మృదంగం మ్రోగుతూంది

అయిపోయిం దిక్కృతిఅన్న కేకతో సంతోష పరవశులైయారు

మళ్ళీ ఏదోకృత్తి ఆరొద మరింత హెచ్చింది

కృతి సాంతం కావడంతోనే సినిమా సంగీతం కోరుతూ గద్దెని కాగితాలతో నింపారు

"సినీమ్యూజిక్ సినీమ్యూజిక్" అని ఓప్రక్క నుంచి ఘొల్లుమన్నారు-

ఊహు! కృతులే సాగుతూన్నాయి-

జనసమ్మర్దం రానురాను హెచ్చుతూంది

సినీగాయకురాలు కృతులు పాడడమే ఆశ్చర్యార్థకం. దానికితోడు కోరికను ఆమోదించకుండా గానం సాగించడం ఒకటి. ఆవేశం వచ్చింది! ఒక్కసారిగా సముద్రంలా ఉన్న జనంలో ఒక్క ఊపు వచ్చింది.

ముందున్నవారు లేచి నిలబడ్డారు.

సర్దుకున్నారు.

కూర్చున్నారు.

ముందువారు వెనుక, వెనుకవారు ముందయ్యారు.

కృతులింకా సాగుతూనే ఉన్నాయి. మైక్‌లో ఏదో రొదతప్ప చెవులకు ఏమీ అందడం లేదు.

ఉద్రేకం వచ్చి ఆవేశంతో నిండియున్నారు రక్షకులు, రసికాసురులు ఓపికగానే ఉన్నారు కాని ఒక్కసారి స్త్రీ సమూహంలో అలజడి కల్గి గీతాకుమారి సినిమా సంగీతంకొరకై వేచి వేసారియున్న రసిక బృందంయొక్క దృష్టి నాకర్షించింది. వెంటనే యీ జనసముద్రంలో రసికాసురులు కెరటాలుగా బయలుదేరి స్త్రీ సమూహం అనేతీరాన్ని చేరడం మొదలెట్టాయి. ఈ సన్నిపాతానికి మధ్యంలోనున్న గద్దె గాలిలో ఊగనిపించింది; గద్దె ఘొల్లుమంది. మృదంగం ఆ ఆఘాతానికి ఆకాశంలో కొంతసేపు పల్టీలుకొట్టి యథాస్థానం అలంకరించింది, ఫిడేలు తేలుతోంది. కార్యగాళ్ళు మాయం.

గీతాకుమారి ధైర్యంచేసి లేచి గద్దెపైనిలబడి "శాంతి, శాంతి" అని చేతులుత్రిప్పుతూ గాంధీ బోధచేయ ఉపక్రమించింది. కాని ఆవేశానికి అంతులేదు! జన సముద్రంలోంచి కెరటాలు పడే పడే వస్తూన్నాయి! కొన్ని కెరటాలు గద్దెను మ్రింగబోయాయి. గీతాకుమారి క్రింద కొరిగింది. రక్షణార్థమై బలశాలులు ముందుకురికారు; కర్రలు పైకి లేచాయి.

"దారి, దారి" అని గద్దె కెదురుగా ఉన్న గృహంలోనికి కుమారికి చేరదీశారు.

ఒక్కసారిగా జనసముద్రం వెల్లువికింది. . రసికాసురుల నలుగుడు వచ్చింది.

కుయ్యో, మొర్రో అన్న ఘోషలు.

ఏడ్పులు!

పెడబొబ్బలు ఆకాశానికి అందుతూ ఉన్నాయి!

నలుగుడు కాగలేక రసికాసురులు అరుగుల మీద కురికారు.

వస్త్రాపహరణప్రాణాపాయభయంతో ఘొల్లుమంటూ ఆడ సమూహం ఇళ్ళల్లోకి పరుగులు తీశారు.

తలుపులు భళ్ళుమన్నాయి. కిటికీలు ఫెడీలు, ఫెడీలు మన్నాయి! అక్కడున్న మ్యునిసిపల్ చెత్తడబ్బాలు మారుమ్రోగాయి; అదంతా ఒక మహా రణరంగం, బ్రహ్మాండం పగిలినట్లు ఫెళ ఫెళారావంతో నభోంతరాళాలు మధ్యంగా మహాశబ్ద నినాదంతో ఆసభాస్థలం మారుమ్రోగుతూంది.

.... . . .....

...... ...... ......

"శాంతం, శాంతం, కూర్చోండి కూర్చోండి" అని మైక్‌లో గోల అదేలోపించాయి ఆసమయంలో!

మళ్ళీగోల మైక్‌లో!

"బాబోయ్ ప్రక్క వాయిద్యాలు, వెదకండి వెదకండి" అని ఘోష!

సభలో నిశ్శబ్దం,

తెప్పరిల్లి వెతకడం ప్రారంభించారు.

"ఉన్నాం, ఉన్నాం" అని ఓమూలనుంచి మూలుగు వినబడింది!

బాగా తేరిపారి చూచేటప్పటికి ఒకరినొకరు కాగలించుకొని గద్దెక్రింద వ్రేలాడుతూ సురక్షితంగా ఉన్నారు; వారినీ సురక్షితంగా కుమారి వద్ద చేర్చారు!

"ఇంక చాలు! సభ యింతటితో చాలించాం; గానం ముగిసింది; దయచేయండి" అని పెద్దగా మైక్‌లోంచి యెవరో అరుస్తున్నారు!

ఆవేశం తగ్గి విన్నారు, నమ్మలేక పోయారు! కాని చేసేది యేమీలేక గృహోన్ముఖులు కావడం ప్రారంభించారు!

ఇంకా సంతుష్టిపడని వారు అంతుచూస్తామని వేచియున్నారు.